క్లుప్తంగా

మానవాళిని నడిపించే ఏకైక గ్రంథం భగవద్గీత



భట్టిప్రోలు: మానవాళిని నడిపించే ఏకైక గ్రంథం భగవద్గీత అని సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి అన్నారు. భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో శనివారం ఆశ్రమ 49వ వార్షికోత్సవం, గీతా జయంతి పురస్కరించుకుని శనివారం జ్యోతి ప్రజ్వలన, పాదుకులకు అభిషేకం, శ్రీ కృష్ణ పరమాత్మకు అష్టోత్తర శతనామాలతో పూజలు జరిపారు. శ్రీ మద్భగవద్గీత పారాయణ, కర్పూర యజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా రైతు దినోత్సవం



కర్లపాలెం: రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని కొత్త నందాయపాలెం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు, రైతు ఆట్ల అయ్యప్పరెడ్డి అన్నారు. శనివారం దాస్ నగర్ గ్రామం వద్ద సెర్ప్ సంస్థ, ధరణీపుత్ర రైతు ఉత్పతిదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మార్కెట్‌లో మంచి ధర కూడా వస్తుందని చెప్పారు. ధరణీపుత్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎండీ శివారెడ్డి మాట్లాడుతూ నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఏర్పాటైన ధరణీపుత్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సంస్థ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



భట్టిప్రోలు: స్థానిక పంచముఖ మండపాల వద్ద శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ జరిగింది. పడి పూజకు 18 మెట్లు ఏర్పాటు చేసి, పూలతో అలంకరించారు. గురుస్వామి పార్థసారథి ఆధ్వర్యంలో శిష్య బృందం అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది.

క్రీడాకారులకు కిట్లు అందజేత



వేమూరు: క్రీడాకారులకు గ్రేస్ ఫౌండేషన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేం రాజు అన్నారు. మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ యూత్ క్రీడాకారులకు వాలీ బాల్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. పచ్చిగళ్ల అనిల్, సురేష్, బుల్లా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సులతో చట్టాలపై అవగాహన

పీడీఎం కోర్టు జడ్జి జగదీష్



భట్టిప్రోలు: న్యాయ విజ్ఞాన సదస్సుల్లో గ్రామాల్లో నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన వస్తుందని పీడీఎం కోర్టు జడ్జి జగదీష్ అన్నారు. భట్టిప్రోలు దళితవాడలో శనివారం రాత్రి జాతీయ న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత న్యాయ సహాయం, గృహ హింస చట్టం, న్యాయ సేవా సంస్థ అందించే సేవలతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే వాహన చట్టంలోని పలు అంశాలను గురించి వివరించారు. ఏజేసీజే కోర్టు జడ్జి రూపశ్రీ, ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్, న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిమ్మతోటల పరిశీలన

తెనాలిటౌన్: రూరల్ మండలం సంగం జాగర్లమూడి గ్రామంలోని నిమ్మతోటలను ఉద్యాన శాఖాధికారులు శనివారం పరిశీలించారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. ఉద్యానశాఖ తెనాలి మండల విస్తరణాధికారి పులి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నిమ్మ చెట్లకు ఆశించే తెగుళ్ల, చీడపీడలు గురించి రైతులకు అవగాహన కల్పించారు.

అ'ధర'హో..



హార్వెస్టర్‌తో వరి కోత



కాటా వేసిన ధాన్యం బస్తాలు

- ప్రభుత్వ మద్దతు ధరపై రైతుల హర్షం
- తేమతో సంబంధం లేకుండా . ధాన్యం కొనుగోలు
- దిగుబడులు సైతం ఆశాజనకం
- ముమ్మరంగా సాగుతున్న వరి కోతలు

పిట్టలవానిపాలెం: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం ధర రికార్డు స్థాయిలో పలికింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.1840లు ప్రకటించింది. సాధారణంగా మద్దతు ధరకు అమ్మాలంటే ధాన్యం బాగా ఆరాలి, తేమ శాతం కూడా రెండుకు మించి ఉండకూడదు. తారం కూడా తీసివేస్తారు. కానీ ఇలాంటివి ఏమీ లేకుండా ప్రస్తుతం రైతులు ధాన్యాన్ని మంచి ధరకు అమ్ముకోగలుగుతున్నారు. ఈ రేటు భవిష్యత్‌లో ఎలా ఉంటుందోనని.. ముందస్తు వరి నాట్లు వేసిన రైతులు ప్రస్తుతం హార్వెస్టర్లతో వరి కోతలు పూర్తి చేస్తున్నారు. కోసిన వెంటనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. పూర్తి స్థాయిలో కోతలు మరో పది రోజుల్లో ప్రారంభమయ్యే పరిస్థితి కన్పిస్తోంది. అయితే ఈ ఏడాది మండల పరిధిలో 11,600 ఎకరాల్లో వరిని సాగుచేశారు. ప్రస్తుతం మండల పరిధిలోని సంగుపాలెం,కోడూరు, కోమలి, భవనంవారిపాలెం, చోడిపాలెం తదితర గ్రామాల్లో వరి పైరు కోతకు సిద్ధమైంది. మరో పది రోజుల్లో వరి నూర్పిళ్లు ముమ్మరం కానున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం ధర బాగుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే బియ్యం ధర కూడా మూడు నెలల క్రితమే పెరిగింది. 50 కిలోల బియ్యం బస్తా రూ.3వేల ధర పలుకుతోంది. ప్రభుత్వ మద్దతు ధరతో..75కిలోల ధాన్యం బస్తాను రూ.1800వరకు వ్యాపారులు వరి కోసిన రైతు వద్దకు వెళ్లి కల్లాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపడం కూడా ఇదే మొదటిసారి.

ఎన్నడూ లేని విధంగా కొనగోలు



గతంలో ఎన్నడూ లేని విధంగా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయి. పెట్టుబడి సాయం అందించడం, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు లాంటి అనేక కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– పిట్టు వెంకటసుబ్బారెడ్డి, రైతు, పిట్టువారిపాలెం.

2వేల క్వింటాళ్ల కొనుగోలు

మండలంలో మొత్తం 12 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఖాజీపాలెం, మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా 2వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది.

–సత్యానంద్, మండల వ్యవసాయాధికారి, పీవీపాలెం.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఇటీవల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు సాయం చేయడం చాలా శుభపరిణామం. ప్రభుత్వ మద్దతు ధరతో రైతులకు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

–చేబ్రోలు వీరయ్య, రైతు, చందోలు.

క్రీస్తు మార్గంలో పయనించాలి



నూతన వస్త్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె రూరల్: క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. షారోనా వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకురాలు దాసరి రెప్పర్ భరణి ఆధ్వర్యంలో పట్టణంలోని 20వ వార్డు నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొని, మాట్లాడారు. అనాథ చిన్నారులకు నూతన వస్త్రాలు, రగ్గులు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, కమిషనర్ విజయసారథి, ఏఈఎల్‌సీ పాస్టర్ అబ్రహం, పెదపల్లి జాన్‌హనోక్, నాగరాజు, వెంకటేశ్వరరావు, ప్రకాష్ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పిట్టలవానిపాలెం: క్రీస్తు బోధనలు అనుసరణీయమని విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఖాజీపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు విద్యుత్ శాఖ సిబ్బంది ఐకమత్యంతో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖసిబ్బంది, స్థానికులు ఉన్నారు.



ఫుడ్ స్టాల్ పరిశీలిస్తున్న ఏడుకొండలరెడ్డి

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

చెరుకుపల్లి: క్రీస్తు జన్మదినం ఎంతో శుభకరమని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి అన్నారు. మండలంలోని పొన్నపల్లి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచారు. నిస్వార్థంగా పనిచేసే ప్రతి ఒక్కరికి దేవుని దీవెనలు ఉంటాయన్నారు. పాఠశాల ఆవరణలో 48 ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్ ఏర్పాటు చేసి, ఎక్కువ అమ్మకాలు జరిపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని చైర్మన్ ఏడుకొండలరెడ్డితో పాటు ప్రిన్సిపల్ నర్గీస్ క్వాజి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ ప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

రేపల్లె రూరల్: ఉప్పూడి గ్రామంలో సర్పంచ్ గుజ్జర్లమూడి విజయ బేబి–ఇమ్మానుయేలు భాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ రత్న ప్రభాకర్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. 300 మంది చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరనాథబాబు, గరికపాటి భానుకోటి, మేడికొండ సుధాకర చంద్రహాసరావు, మేడికొండ అనిల్, చిత్రాల ఓబేదు పాల్గొన్నారు.



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న రాధాకృష్ణమూర్తి

సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న వైఎస్సార్ సీపీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలోని ప్రతి ఒక్కరి శ్రేయస్సు కోసం పాటుపడుతున్నారని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం మొసలిపాడు గ్రామంలో ఆయన మొట్ట మొదటి సారిగా పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. స్థానికులతో మమేకమై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సమాజంలో జరుగుతున్న పెత్తందార్ల దోపిడి నుంచి సామాన్య ప్రజాలను కాపాడాలన్న తలంపుతో సీఎం వైఎస్ జగన్ పరితపిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధి వర్గాల ద్వారా దూరమయ్యే ప్రమాదం పొంచి ఉన్న తరుణంలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా మెలగాలని సూచించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ప్రభుత్వ పథకాలు అరకొరగా అందేవని, ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా ఎవరి ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఒక్క ఓటు వేసినా.. ప్రస్తుతం జరుగుతున్న సామాజిక అభివృద్ధి ఎన్నో ఏళ్ల వెనకబడి పోయినట్లేనన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కాలువ కట్ట వెంబడి కొన్నేళ్ల క్రితం నిర్మించుకున్న గృహాలకు విద్యుత్తు సదుపాయం లేదని స్థానికులు వరికూటి దృష్టికి తీసుకురావడంతో అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, మొసలిపాడు, బొద్దులూరుపాడు, తడికలపూడి సర్పంచ్‌లు కట్టుపల్లి అనిత, గుర్రం మురళి, సూరపనేని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సుగ్గున అశోక్, అమిరిశెట్టి శ్రీధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, మాజీ సర్పంచ్‌లు కట్టుపల్లి సోమయ్య, సుగ్గున మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీస్తు జన్మదినం లోకానికి శుభకరం

ఆళ్ళమూడి(భట్టిప్రోలు): క్రీస్తు జన్మదినం లోకానికి శుభకరమని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఆళ్ళమూడిలో శవారం రాత్రి జాన్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీపీ వెంకట లలితకుమారితో కలసి కేక్ కట్ చేశారు. క్రీస్తు బోధనలు తరతరాలకు ఆచరణయోగ్యమన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని ఒక విశ్వ పండుగలా జరుపుకోవడం గొప్ప సంస్కృతిగా అభివర్ణించారు. తొలుత పల్లెకోనలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పల్లెకోన, ఆళ్ళమూడి వాసులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పెద్దిశెట్టి రాంబాబు బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి), అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మండవ రామకోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, ఏపూరి నాగు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడలను విజయవంతంగా నిర్వహించాలి

డీపీఓ డి.రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ రాంబాబు

కర్లపాలెం: ఆడదాం ఆంధ్రా ఆటల పోటీలను విజయవంతంగా నిర్వహించాలని బాపట్ల డీపీవో, కర్లపాలెం ఎంపీడీవో దాసరి రాంబాబు అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆడదాం ఆంధ్రా క్రీడల నిర్వహణపై డీపీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. గ్రామస్థాయిలో క్రీడా జట్లను నమోదు చేసుకుని, ఆటల పోటీలు నిర్వహించాలన్నారు. నల్లమోతువారిపాలెం, పాతనందాయపాలెం, ఏట్రవారిపాలెం, బుద్ధాం, యాజలి, దమ్మనవారిపాలెం, దుండివారిపాలెం, గ్రామ సచివాలయాల పరిధిలోని క్రికెట్ క్రీడాకారులకు యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు జరుగుతాయని చెప్పారు. కర్లపాలెం, చింతాయపాలెం, గణపవరం, పెదపులుగువారిపాలెం, తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం, పేరలి, సమ్మెటవారిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలోని క్రికెట్ క్రీడాకారులకు చింతాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రికెట్ పోటీలు జరుగుతాయని డీపీఓ తెలిపారు. ఆటల పోటీలను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులపై ఉందని డీపీవో రాంబాబు స్పష్టం చేశారు.

వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. భర్త నుంచి విడిగా ఉంటున్న ఆమెను భర్తే కిడ్నాప్ చేశాడని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం మేరకు.. నిజాంపట్నంకు చెందిన లక్ష్మీవర్షిత, డేవిడ్ ప్రేమించుకున్నారు. పెద్దలను ఎదురించి ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే వ్యక్తిగత కారణాలతో వారు విడిపోవడంతో యువతి ఆమె పుట్టింటిలో ఉంటోంది. యువతి, ఆమె కుటుంబ సభ్యులు శనివారం తెనాలి వైకుంఠపురం దేవస్థానానికి వచ్చి దర్శనం అనంతరం సినిమాకు వెళ్లారు. సినిమా అయ్యాక డేవిడ్ తమపై దాడి చేసి, తమ కుమార్తెను కిడ్నాప్ చేశాడని యువతి తండ్రి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

• ఉత్తర ద్వార దర్శనం.. మోక్ష ప్రాప్తి మార్గం

హరి నామస్మరణతో వైష్ణవాలయాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునే శ్రీమన్నారాయణుడి ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరారు. కనుల నిండా స్వామిని దర్శించుకుని ఇహలోకంలో సిరిసంపదలతో తులతూగాలని, పరలోక మోక్షప్రాప్తి లభించాలని మొక్కుకున్నారు. విష్ణు సహస్ర నామ పారాయణం, హరేరామ..హరేకృష్ణ జపంతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అర్చకులు ఆలయాల్లో సుప్రభాత సేవలు, విశేష అర్చనలు, మంత్రపుష్పాది కార్యక్రమాలు, అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌లను విశేషంగా అలంకరించి, భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

– రేపల్లె రూరర్/పిట్టలవానిపాలెం/భట్టిప్రోలు/బాపట్ల అర్బన్/కర్లపాలెం.



భట్టిప్రోలు: వేణుగోపాల స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న భక్తులు



రేపల్లెలో వేంకటేశ్వరస్వామికి..



ఐలవరంలో వేణుగోపాల స్వామిని దర్శించుకున్న భక్తులు



బాపట్ల అర్బన్ గరుడ వాహనంపై రుక్మిణీ సమేత పాండురంగ స్వామికి పూజలు



కర్లపాలెం: ఉత్తరద్వార దర్శనమిచ్చిన రాజ్యలక్ష్మీ సమేత జనార్దనస్వామి



ఉత్తర ద్వారం ద్వారా వేంకటేశ్వరస్వామి దర్శించుకుంటున్న భక్తులు

గ్రామస్థాయి కార్యకర్తలకే పూర్తి బాధ్యత



కార్యకర్తలతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి(వేమూరు): వైఎస్సార్ సీపీని మరలా అధికారంలోకి తీసుకొచ్చేందుకు గ్రామ స్థాయి కార్యకర్తలకు పూర్తి బాధ్యత ఇవ్వనున్నట్లు ఆ పార్టీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. అమర్తలూరు మండలం కూచిపూడి గ్రామంలోని ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో మండలస్థాయి కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రి చేసేందుకు పార్టీ నాయకులు, కార్య కర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ మండలాధ్యక్షుడికి, జేసీఎస్ కన్వీనర్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఐక్యతతో పని చేయాలని సూచించారు. అందరు కష్ట పడి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, పార్టీ మండలాధ్యక్షుడు యలవర్తి సురేష్, సర్పంచ్ కొండముది శ్యామలా, జేసీఎస్ కన్వీనర్ బొట్టు మోషే, మోదుకూరి హరిబాబు, సీనియర్ న్యాయవాది గుమ్మడి రవిరాజా, ఎంపీటీసీ తెనాలి సుమలత, మూల్పూరు సాగర్, సర్పంచ్‌లు దేవరకొండ రాము, కొండపల్లి కిరణ్‌బాబు, ఎంపీటీసీ తెనాలి పవన్ కళ్యాణ్, ఎంపీటీసీ ప్రతాప్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమ్మెకు ఫ్యాప్టో మద్దతు

పిట్టలవానిపాలెం: సర్వశిక్షా అభియాన్ సిబ్బంది కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు తమ మద్దతును తెలిపాయి. ఎంఈఓ వెంకటేశ్వరరావుకు తమ మద్దతు తెలియజేస్తూ లేఖను శనివారం సంఘాల నాయకులు అందజేశారు. సర్వశిక్షా అభియాన్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యదర్శి పరిశ నరసింహారెడ్డి, యూటీఎఫ్ మక్‌బుల్ ఉన్నారు.

అంతర పంటలతో అత్యధిక లాభాలు

ఫిరంగిపురం: అంతర పంటలు వేయడం ద్వారా అత్యధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయశాఖ డీపీఎం రాజకుమారి అన్నారు. మండలంలోని 113 తాళ్లూరు, తక్కెళ్లపాడు గ్రామాల్లోని మిరప పంటను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ద్రవ జీవామృతం తయారు చేసుకునే విధానం దానిని ఏవిధంగా ఉపయోగించాలో రైతులకు వివరించారు. మిరప పంటలో అంతర పంటలుగా ముల్లంగి, కొత్తిమీర, ఉల్లి పంటలు వేయాలని సూచించారు. లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా పచ్చపురుగును నివారించవచ్చని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో నెల్లూరు యువకుడి మృతి



మృతి చెందిన వంశీకృష్ణ

చెరుకుపల్లి: ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన కావూరు గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. స్థానిక పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం ఎగువమెట్ట గ్రామానికి గ్రామానికి చెందిన మేనాటి వంశీకృష్ణ(22) అనే యువకుడు వరికోత హార్వెస్టర్ ఆపరేటర్‌గా ఇక్కడికి వచ్చాడు. శనివారం ఉదయం 12 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై కర్లపాలెం నుంచి చెరుకుపల్లి వచ్చి భోజనం చేసి తిరిగి వెళ్తున్నాడు. కావూరు గురుకుల పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనటంతో వంశికృష్ణకు తలకు బలమైన గాయాలు తగిలి, అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై ఏఎస్సై బ్రహ్మం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.